# విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 16 ఫిబ్రవరి 2025    8 పేజీలు


# దగాకోరు బడ్జెట్

## సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

**విశాలాంధ్ర -భీమవరం:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదల వ్యతిరేక, కార్పోరేట్ అనుకూల బడ్జెట్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడు తున్న మోడీ పరివారం తగిన మూల్యం చెల్లించు కోవాల్సి వస్తుందని వామపక్ష పార్టీలు హెచ్చరిం చాయి. ప్రజా వ్యతిరేక, కార్పోరేట్ అనుకూల బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వామపక్ష పార్టీల అధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనా కార్యక్రమాల్లో భాగంగా శనివారం భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్లో వామపక్ష పార్టీల అధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, కార్పోరేట్ ఆస్తులు పెంచే బడ్జెట్ అని నిప్పులు చెరిగారు. ఆదాయం పన్ను పన్నెండు లక్షలకు పెంచామన్న పాలకులు నిరుపేద కూలీలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ పథకంలో రెండు వందల రోజులు కల్పించలేదని బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం దారుణమని విమర్శించారు. ఏటేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న మోడీ నిరుద్యోగులను మోసం చేశాడని ఉద్యోగం, ఉపాధికి నిధులు కేటాయించలేదని కోనాల విమర్శించారు. నాడు పంజాబ్ హర్యానా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నల్ల సాగు చట్టాలను ఉపసంహరిస్తానన్న మోడీ మళ్ళీ మాట తప్పాడని, నల్ల సాగు చట్టాలను నిరసిస్తూ ఢిల్లీ వీధుల్లో అసువులు బాసిన 750 మంది రైతుల ఆత్మబలిదానాన్ని మోడీ అపహాస్యం చేస్తున్నాడని కోనాల విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణకు చర్యల్లేవని, స్వామి నాథన్ కమిటీ

▶మిగతా 2లో..

## ప్రభుత్వంపై అసంతృప్తి

- 23న మన గ్యాస్ మనకే దక్కాలని కాకినాడలో సదస్సు
- సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

**విశాలాంధ్ర-రాజమండ్రి:** కేంద్రం రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ప్రకటిస్తే పెట్టుబడులు అవే వస్తాయి అని ప్రజలకు ఉపాధి పెరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. శనివారం స్థానిక మెరకవీధిలో జట్ల లేబర్ యూనియన్ మేస్త్రీల సమావేశం యూనియన్ అధ్యక్షులు కుంద్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మధు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ అమలు చేయకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన విద్యుత్ బకాయిలను నేడు ప్రజల నెత్తిన వేసిందని అన్నారు. 8 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల అంశంలో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేదన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకునేందుకు కార్పరేట్‌లపై పన్నులు

▶మిగతా 2లో..

## మోదీ అమెరికా పర్యటన ఎవరికి ప్రయోజనం?

సీపీఐ జిల్లా కార్యదర్శి కెఎస్ బాబు



**విశాలాంధ్ర - అమలాపురం :** ప్రధానమంత్రి మోదీ అమెరికా పర్యటన ఎవరికి ప్రయోజనకరమని సీపీఐ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కెఎస్ బాబు అన్నారు. ప్రధాన మంత్రి మోదీ-అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ద్వై పాక్షిక వాణిజ్యం 2030 నాటికి 50 వేల కోట్ల డాలర్లకు చేరువ కావాలని వైట్ హౌస్ సంయుక్త సమావేశం నిర్ణయం తీసుకున్నారని వార్త పత్రికల కథనమని పేర్కొన్నారు. ఇటీవల నిర్మలమ్మ బడ్జెట్లో మిలటరీకి కేటాయించిన బడ్జెట్ ఎంత! సదరు కేటాయింపులతో ఎఫ్-35 యుద్ధ విమానాలు కొనేందుకు సాధ్యం కాదు కదా అని అన్నారు. బడ్జెట్ ఇతర ఖర్చు అంటే అమెరికా నుండి అరువు కొనుగోలు చేయటం సదరు అప్పుకి అసలు వడ్డీ కట్టడం ఇది ఎవరికి ప్రయోజనం అని ప్రశ్నించారు. ఆ ప్రయోజనం అమెరికా కే కదా అన్నారు.

అమెరికా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలును పెంచడం ఇది ఏమి వాణిజ్యం అన్నారు. చమురు, గ్యాస్ ఉత్పత్తి ఎక్కువగా ఉన్న అరబ్ ఎమిరేట్స్ నుంచి కొనుగోలు కంటే అధిక ధరలు చెల్లింపులు చేసి మనం అమెరికా వద్ద కొనుగోలు చేస్తే ఎవరికి లాభమో ప్రజలు గమనించాలని పేర్కొన్నారు. భారతదేశం తాను దిగుమతి సుంకాలు పెంచితే నేను అందుకు తగ్గట్టుగానే వ్యవ హరిస్తానుఅని ట్రంప్ ప్రధాని ముఖం మీదే తెగేసి చెప్పారుఅని, 2030 నాటికి 50 వేల కోట్ల డాలర్ల వాణిజ్య ఒప్పందం కూడా అమెరికాకే మేలు చేస్తుంది కదా అని సత్తిబాబు పేర్కొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**విశాలాంధ్ర-భీమడోలు:** ఇంటితోపాటు సమీప పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. గుండుగొలను గ్రామంలో చెత్తనుండి సంపద సృష్టించే కేంద్రాన్ని శనివారం స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛదివాస్ కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వెట్రిసెల్వి గ్రామంలో పారిశుధ్య కార్మికుల ద్వారా తడిచెత్త,పొడిచెత్త వేరుచేసే మూడురకాల బుట్టలను అందజేసే విధానాన్ని గ్రామంలో వున్న నివాసితులను అడిగి తెలుసుకున్నారు. తడిచెత్త, పొడిచెత్త వేరుచేసే ప్రక్రియ గురించి ఇంటి యజమానులను ఆరా తీశారు. గ్రామంలో డ్రైనేజీలో పేరుకు పోయిన చెత్తను ప్రతి శుక్రవారం క్లీన్ చేసే విధానాన్ని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో ఎక్కడా కూడా డ్రైనేజీలో చెత్త నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. పబ్లిక్ కుళాయిలు లీకేజీలు లేకుండా అరికట్టి నీటిని వృథా కాకుండా చూడాలన్నారు. అనంతరం ఆగ్రామంలో ఉన్న చెత్తనుండి సంపదను తయారుచేసే కేంద్రాన్ని సదర్శించారు. కేంద్రంలో వున్న చెత్త నుండి తయారుచేసే సేంద్రీయ ఎరువును పరిశీలించి వీటిని రైతులకు

▶మిగతా 2లో..

## రికార్డులు సక్రమంగా ఉండాలి

ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

**విశాలాంధ్ర - కలిదిండి:** పోలీస్ స్టేషన్లో రికార్డులను సక్రమంగా ఉండేలా చూసుకోవాలని ఎస్పీ కే. ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ సాధారణ తనిఖీలలో భాగంగా రికార్డులన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. పలు కేసులకు సంబంధించి పూర్వపరాలు పరిశీలించారు. పాత కేసుల గురించి పరిష్కారాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో మహిళా పోలీసులతో మాట్లాడుతూ గ్రామాల్లో సమాచారం ఎలా

▶మిగతా 2లో..

## ఉపాధి పనుల సామాజిక తనిఖీ

**విశాలాంధ్ర-లింగపాలెం:** లింగపాలెం మండలంలో 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు మొదలుపెట్టారు. ఈ ఏడాది కాలంలో 1600 పనులు జరిగాయి. వీటి కోసం రూ. 18 కోట్లు కూలీలకు, రూ.2 కోట్లు మెటీరియల్‌కు ఖర్చు చేశారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు 20 రోజులపాటు గ్రామాలలో పర్యటించి జరిగిన పనులపై పూర్తి వివరాలను సేకరించి తనిఖీలు చేస్తారు. అనంతరం మండల స్థాయిలో గ్రామసభ నిర్వహించి వివరాలు వెల్లడిస్తారు. ఈ తనిఖీలకు డిఆర్పిలుగా నాగ భూషణం, వెంకటరాజు, నాచారయ్య, మీనా, ధనలక్ష్మిలను నియమించారు. లింగపాలెంమండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో వరలక్ష్మి నుంచి డిఆర్పిలు పనుల వివరాలు సేకరించారు.

## ఓటు నమోదు నిరంతర ప్రక్రియ

**విశాలాంధ్ర- ముసునూరు:** ముసునూరులో శనివారం మండల రెవెన్యూ అధికారులు ఓటు ఆవశ్యకత, ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థు లతో ర్యాలీగా వెళ్లి పోలీస్ స్టేషన్ సెంటర్లో మానవ హారం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ,ఓటు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిసేలా విద్యార్థులచే మానవహారం చేపట్టినట్లు తహసీల్దార్ కే. రాజకుమార్ తెలిపారు. మీ ఓటే మీ భవిష్యత్తుకు దిశా నిర్దేశమని ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా దేశాభి వృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ రాజు, వీఆర్వో మస్తాన్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ విద్యార్థుల స్వచ్ఛ ఆంధ్ర

**విశాలాంధ్ర- నూజివీడు టౌన్:** కృష్ణ విశ్వవిద్యాలయం డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలేజ్ ఆఫ్ పీజీ స్టడీస్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పిజి సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ జె. లావణ్య లత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు లభ్యమవ్వాలంటే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పరిశుభ్రత బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 అధికారులు డాక్టర్ అన్వర్ భాష, డాక్టర్ టి.నాగరాజు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలకు విశ్రాంతి ఉపాధ్యాయుడు విరాళం

**విశాలాంధ్ర- నూజివీడు టౌన్:** ఇటీవల పదవీ విరమణ చేసిన శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు అక్కల నాగిరెడ్డిని శనివారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి నాగిరెడ్డి ఐదువేల రూపాయలు విరాళాన్ని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని రాధికా రాణి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, జె లక్ష్మి,మల్లీశ్వరి, బాలు, సాకా రవి తదితరులు పాల్గొన్నారు.

## పోషణ్ బీ పడాయ్ బీ పై శిక్షణ

**విశాలాంధ్ర- పాలకోడేరు :** పాలకోడేరు లోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిన పోషణ్ భీ పడాయ్ భీ శిక్షణా కార్యక్రమానికి ఐసిడిఎస్ సిపిడిఓ వాణి విజయరత్నం హాజరు అయ్యారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకివీడు ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలలో 13వ తేదీ నుంచి 15 వరకు అంగన్వాడీ కార్యకర్తలకు పోషన్ బి పడాయ్ బి పై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఈ శిక్షణా తరగతుల్లో భాగంగా పోషణ, విద్య ప్రాముఖ్యత గురించి నిర్దేశించిన సెషన్స్ వారీగా అంగన్వాడీ కార్యకర్తలకు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్స్ జి పార్వతి, కే సూర్య కుమారి, మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## సక్రమంగా ఉండాలి

(1వ పేజీ తరువాయి)

తెలుసుకుంటున్నారు. సమాచారం వస్తుందా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమాచార సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఉంటే ఎస్ఐ, సిఐల దృష్టికి తీసుకుని వెళ్లాలని సూచించారు. కలిదిండి శివారు భోగేశ్వరంలో కొలువై ఉన్న శ్రీ పార్వతి సమేత పాతాళ భోగేశ్వర స్వామిని ఆయన దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈనెల 26 మహాశివరాత్రి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు భక్తులకు కలగకుండా చూడాలని సీఐ వి. రవికుమార్‌కు సూచించారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 21 సీసీ కెమెరాలు స్టేషన్లో మోనిటరింగ్ సిస్టం ప్రారంభించారు. సీసీ కెమెరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. నేరస్తులను త్వరితగతిని పట్టుకోవడానికి సీసీ కెమెరాలు నేరస్తులను పట్టుకోవడానికి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన షటిల్ కోర్టును ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కలిదిండి మండలంలోని 21 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా వాటిలో 16 సీసీ కెమెరాలు మండల కేంద్రమైన కలిదిండిలోని వ్యాపారులు అందించారని వారికి అభినందనలు తెలిపారు.

## బాధ్యత

(1వ పేజీ తరువాయి)

సరఫరాచేసే విధానాన్ని, కేంద్రంలో పనిచేసే సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి చెత్తనుండి సంపద తయారుచేసే కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు.

కార్యక్రమంలో జెడ్పి సిఇఓ కె. సుబ్బారావు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డిపివో కె. అనురాధ, యంపిడివో పద్మావతి, తహశీల్దారు రమాదేవి, ఇవోపిఆర్డి , తదితర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## అసంతృప్తి

(1వ పేజీ తరువాయి)

పెంచాలని మధు డిమాండ్ చేశారు. అప్పులో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోవాలంటే కాకినాడ తీరంలో ఉన్న గ్యాస్ చమురు నిక్షేపాలను మనకు రావలసిన వాటా ఇవ్వాలని కోరుతూ ఈ నెల 23న కాకినాడ గాంధీభవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని అన్ని వర్గాల వారు హాజరై జయప్రదం చేయాలని మధు పిలుపునిచ్చారు. పాలకులు అవలంబిస్తున్న ప్రమాదకర విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, రాష్ట్రాలు సమైక్యంగా పోరాడటమే ముఖ్యమైన కర్తవ్యమని మధు అన్నారు.

ఈ సమావేశంలో జట్ల సంఘం ప్రధాన కార్యదర్శి సప్పా రమణ, ఉపాధ్యక్షులు పి.దేముడు బాబు, కక్కల దుర్గా ప్రసాద్, రెడ్డి వెంకట రావు, నల్ల రామారావు, కాళ్ల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్

(1వ పేజీ తరువాయి)

సిఫార్సులను బడ్జెట్లో ప్రస్తావించలేదని కోనాల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడానికి బడ్జెట్లో చూపలేదని, చేతి వృత్తి దారులను దగా చేశారని ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల సంక్షేమం ఊసే లేదని, ప్రజల భద్రత, సామాజిక న్యాయం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమ ప్రస్తావనలేదని, రుణ విమోచన పథకం ప్రసక్తే లేదని కోనాల విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరామ్ మాట్లాడుతూ కేంద్రం ప్రదర్శించిన బడ్జెట్ ధరలను పెంచేదిగా, నిరుద్యోగ రైతాంగం ఆత్మహత్యలను పెంచేదిగా ఉందని, సామాన్యులను, కౌలు రైతు, కార్మిక, రైతు కూలీలను మోసం చేసే బడ్జెట్ అని రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకుని బడ్జెట్ ను పార్లమెంటుకు తిప్పి పంపాలని డిమాండ్ చేశారు. ప్రజలపై పన్నుల భారం, కార్పోరేట్లకు పన్నుల్లో రాయితీ ఇదెక్కడి న్యాయం అని బలరామ్ ప్రశ్నించారు.సిపిఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి.గోపాలన్ మాట్లాడుతూ ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని పేదలపై భారాలు మోపే బడ్జెట్ అని దుయ్యబట్టారు. 149 కోట్ల మంది ప్రజానీకాన్ని పక్కనపెట్టి దొడ్డి దారిన కార్పోరేట్ శక్తులకు నిధులు కేటాయిస్తున్న దగా బడ్జెట్ అని విమర్శించారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయింపులు లేకపోయిన టిడిపి, జనసేన నోరెత్తకపోవడం దారుణమని, నిధులన్నీ బిజెపి పాలిత రాష్ట్రాలకు వెళ్లి పోతున్నాయని విమర్శించారు.

కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, బి.వాసుదేవరావు, నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు ఎం. ఆంజనేయులు, డి.త్రిమూర్తులు, ఎంసిపిఐయు జిల్లా నాయకులు జి.రాంబాబు, పట్టణ కార్యదర్శి కె.మహంకాళి, ఫార్వర్డ్ బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాస్ రాజు, నాయకులు కనుమూరి వెంకటపతిరాజు, దుగ్గిరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 24న తాడేపల్లి కమిషనరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయండి

**విశాలాంధ్ర-ద్వారక తిరుమల:** రాష్ట్రంలో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న గ్రామీణ పేదలకు తక్షణమే ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని కోరుతూ ఈనెల 24 తేదీన తాడేపల్లి ఉపాధి హామీ కమిషనరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో గ్రామీణ పేదలు పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి.కె.యం. యు.) జిల్లా ఉపాధ్యక్షులు గోలిమే బాల యేసు పిలుపునిచ్చారు.శనివారం ద్వారకాతిరుమలలో మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తల సమావేశం యడ్లపల్లి రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంనకు హాజరైన బాల యేసు మాట్లాడుతూ గ్రామీణ పేదల వలసల నివారణకు ఉపాధి హామీ పనులు పేదలకు కల్పించాలని, రోజు కూలి రూ.700 ఇవ్వాలని, సంవత్సరానికి కుటుంబానికి 200 పని దినాలు కల్పించాలని కోరుతూ బి.కె. ఎం.యు. ఆధ్వర్యంలో ఈనెల 24న తాడేపల్లి లో ఉపాధి హామీ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో బి.కె.ఎం.యు. కార్యకర్తలు పెండ్లి భూషణం, ఏపూరి గంగరాజు,జాలాది సత్తమ్మ,ఉండి మార్తమ్మ, షేక్ దర్గా,యడ్లపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పోషణతో కూడిన ప్రీ స్కూల్ విద్య అందించాలి

**విశాలాంధ్ర - గణపవరం:** పిల్లలకు పోషణతో కూడిన ప్రీ స్కూల్ విద్య అందించాలని దివ్యాంగుల పిల్లల కోసం ప్రత్యేక విద్య ఏ విధంగా చెప్పాలని ఐసిడిఎస్ సి డి పి ఓ టీ లక్ష్మీ సరస్వతి అన్నారు. పోషన్ భీ పఢాయ్ భీ అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం గణపవరం చింతల పాటి సూరమ్మ గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించారు. 0-6 సంవత్సరాలపిల్లలకు పోషణ తో కూడిన ప్రీ స్కూల్ విద్య అందిం చడం. మొదటి రోజు శిక్షణలో జాతీయ విద్యా విధానం - 2020 నిపుణ్ భారత్‌లో భాగంగా నవ చేతన( 0-3 సంవత్సరాలపిల్లలకు) ఆదర్శిలా (3-6 సంవత్సరాల పిల్లలకు) గురించి ప్రీ స్కూల్ 5 రకాల అభివృద్ధులు గురించి గణపవరం ఎంఈఓ గొర్రెల బాలయ్య, సూపెర్వైసర్ పి తులసి చెప్పారు. శాటిలైట్స్కూల్ ,ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ స్కూల్, మోడల్ ప్రైమరీ స్కూల్ గురించి వివరించారు. ఆరోగ్య కేంద్రం సిహెచ్ఓ జే విల్సన్ బాబు మాట్లాడుతూ 2 వ రోజు పోషన్ భీ గురించి శిక్షణ ఇవ్వడమైనది తల్లిపాల ప్రాముఖ్యత, లోప పోషణ తో బాధ పడే పిల్లలకు ఏమి చేయాలని వివరించారు.3 వ రోజు దివ్యంగపిల్లల కోసం ప్రత్యేక విద్య ఏవిధంగా చెప్పాలని పరిశుభ్రత మంచి అలవాట్లు గురించి జి. చంద్రావతి చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. పిప్పర హై స్కూల్ లో సిహెచ్ దుర్గ భవాని, ఎం.సుజాత సూపెర్వైజర్లు ఈ కార్యక్రమం నిర్వహించారు.

## అంగన్వాడీలకు శిక్షణ

**విశాలాంధ్ర- ముసునూరు :** అంగన్వాడి ప్రీ స్కూల్ పిల్లలకు, తల్లులకు,గర్భిణీలకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారం అందించాలని ముసునూరు అంగన్వాడి సెక్టార్ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి సిబ్బందికి సూచించారు. శనివారం రెండవ రోజు ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పోషణ్ బీ...పడాయి బీ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలకు ఎత్తు,బరువు ఆధారంగా పౌష్టికాహారం అందించాలని,తల్లులకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందిస్తూ రక్తహీనతకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించాలని అన్నారు. ప్రతినెల వారి ఆరోగ్య సమస్యలపై సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## స్పా, మసాజ్ సెంటర్లను నిషేధించాలి

### ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వ అనుమతితో నిర్వహిస్తున్న, స్పా, మసాజ్, సెంటర్ల నిర్వహణకు మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ, అసాంఘిక కార్యకలాపాలు నిర్వ హిస్తున్న స్పా,మసాజ్ సెంటర్లను నిషేధించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్.ఎఫ్. ఐ.డబ్ల్యు) ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కొందరు వ్యక్తులు ఈజీమనీ కోసం అడ్డదారులు తొక్కుతున్నా రని, మహిళలను బలవంతంగా వ్యభిచార కూపంలోకి లాగి డబ్బులు దండుకుంటున్నారని విమర్శించారు. ఉద్యోగం లేని, ఆర్థిక ఇబ్బందులలో ఉన్న మధ్యతరగతి, పేద మహిళలను టార్గెట్ చేసి వారికి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి, స్పా సెంటర్లో చేర్పి వారిని బలవంతంగా వ్యభిచారం చేయిస్తూ అందిన కాడికి డబ్బును దండుకుంటు న్నారని విమర్శించారు. వాస్తవాలు తెలుసుకున్న మహిళలను మాఫియా బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మహిళలకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.పోలీసు శాఖ స్పా,మసాజ్ సెంటర్ లపై దృష్టి సారించి నిర్వాహకులపై కఠిన చర్యలు చేపట్టి, సాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్పా,మసాజ్ కేంద్రాలను నిషేధించాలని డిమాండ్ చేశారు.

## భీమడోలులో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్

విశాలాంధ్ర-భీమడోలు: మండలంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కాలేజీలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం భీమడోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని అందరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్.ఎస్.ఎస్.పి ఓ బి. శశికాంత్ పాల్గొన్నారు.

## చర్చి ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

విశాలాంధ్ర-లింగపాలెం: అన్నవనేనివారి గూడెంలో జరిగిన సి.ఎస్.ఐ దేవాలయ ప్రతిష్టలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ దంపతులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ పీఠాధిపతులు జార్జ్ కొర్నేలస్ పాల్గొని ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వ హించారు.ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీఠాధిపతులు ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్ విద్యాధరరావు పాల్గొన్నారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే దంపతులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మత బోధకురాలు కర్లపూడి జ్యోతి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## విద్యుదాఘాతంతో జామాయిల్ తోటలో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర-లింగపాలెం: అన్నవనేనివారి గూడెంలో ఎన్టిపిసి440కెవి విద్యుత్తు లైనుకు షార్ట్ సర్క్యూట్ సంభవించి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎ. శేషగిరిరావుకు చెందిన జామాయిల్ తోట మంటలబారిన పడింది. స్థానికులు స్పందించి మంటలను ఆర్పటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో పలు చెట్లు అగ్ని ప్రమాద బారిన పడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు.

## భారతదేశ సాంప్రదాయాల్ని గౌరవిస్తున్న జర్మన్లు

- వారి సహకారంతో పేదలకు, అనాథలకు సేవలు
- విశాలాంధ్రతో ఫాదర్ ఆదాం

విశాలాంధ్ర-లింగపాలెం: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల పట్ల జర్మనీ దేశస్థులకు గౌరవభావం ఉందని అందువల్లే భారతదేశంలో పేదరికంలో ఉన్న వారికి ఆర్థిక సహకారం అందిస్తున్నారని దీంతో భారతదేశంలోని పలువురు పేదలు, అనాథ విద్యార్థులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జర్మనీలో నివాసం ఉంటూ మత బోధకు నిగా పనిచేస్తున్న ధర్మాజీగూడెంకు చెందిన ఫాదర్ సొంగా ఆదామ్ తెలిపారు. పదేళ్లుగా జర్మనీ దేశంలో నివాస ముంటున్న ఈయన ఆ దేశీయుల సేవా భావాన్ని విశాలాంధ్రకు వివరించారు. జర్మనీయులకు భారతీయులు అంటే అమితమైన గౌరవం ఉందని అన్నారు. భారతీయుల సంప్రదాయాలను, సంస్కృ తిని గౌరవిస్తారని తెలిపారు. భారతదేశంలో అధిక జనాభా ఉండటం వల్ల అనేకమంది పేదరికాన్ని చవి చూస్తున్నారని జర్మనీలు భావిస్తుంటారని పేదరికంలో ఉన్నవారికి సేవలందించా లనే లక్ష్యంతో ఆర్థికంగా తమ వంతు సహాయాన్ని వివిధ మార్గాల ద్వారా అందిస్తున్నారని ఫాదర్ పేర్కొ న్నారు. జర్మనీకి వెళ్లి మత బోధకులుగా పనిచేసే వారి ప్రవర్తనను వీరు గమనిస్తూ ఉంటారని మంచి ప్రవర్తన కలిగిన వారందరినీ జర్మనీలో గౌరవిస్తారని తెలిపారు. భారతీయులు, భారతదేశంపట్ల జర్మనీలు అనురాగంతో ఉంటారని అక్కడ నివసించే భారతీయుల పట్ల నమ్మకం కలిగితే వారిని తమ బిడ్డల్లా ఆదరిస్తారని అన్నారు. జర్మనీలు ఇచ్చే ఆర్థిక సహాయంతో ధర్మాజీగూడెం పరిసర ప్రాంతాలలోని పేద, అనాథలైన దాదాపు 200 మంది విద్యార్థులకు ఏడేళ్ల నుంచి తాను ఆర్థిక సహాయాన్ని అందించ గలుగుతున్నానని ఫాదర్ ఆదాం తెలిపారు. తాను చేసే సహాయం అంతా జర్మన్ల సహకారంతోనేనని అన్నారు. పేదరికంలో పుట్టిన తాను పీజీ ఫిలాసఫీ, తియాలజీ చదువుకున్నానని తాను ఉన్నత చదువు చదవడానికి ఆర్.సి.యం సంస్థలో ఎందరో గురువుల సహకారం ఉందని తెలిపారు. తాను సహాయం అందించే పేద విద్యార్థులలో అనేకమంది ఉన్నత విద్యను అభ్యసించటం సంతోషంగా ఉందని అన్నారు. జర్మనీలు అందించే సహాయం భారతదేశంలోని పేదలకు సక్రమంగా అందుతుందా? లేదా? అనే దానిపై వీరు మనదేశంలో పర్యటించి పరిశీలన చేస్తుంటారని వీరి పరిశీలనలో లోపాలు కనిపిస్తే సహాయం అందించరని అన్నారు. యువత చెడు వ్యసనాలకు, సంప్రదాయాల జోలికి వెళ్లవద్దని మంచి మార్గంలో నడవాలని తెలిపారు. నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలనేదే తన లక్ష్యమని ఆయన ఈసందర్భంగా పేర్కొన్నారు.

## వ్యర్థాల నిర్వహణపై ప్రణాళిక ఉండాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : వ్యర్థాల నిర్వహణ పట్ల సరైన ప్రణాళిక ఉండాలని భీమవరం ఎక్సైజ్ సీఐ జి. బలరామరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో స్థానిక ఆర్ ఆర్ డి ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం మరియు స్వచ్ఛతా కమిటీ ఆధ్వర్యంలో మనిషి సృష్టించిన చెత్తను "మనిషే ఒక సమస్యగా మార్చరాదు" అనే థీమ్ ను అనుసరించి నడవాలని ఆయన అన్నారు శనివారం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ప్రారంభిస్తూ ఆయన తడి ,పొడి, హానికర వ్యర్థాలను వేరుచేసి వాటికి కేటాయించిన డస్ట్ బిన్లలో వేయడం, సత్వరమే వాటిని తరలించటం చేయాలని ముఖ్యంగా చెత్త నుండి విద్యార్థులు కరెంటు, కంపోస్టు ఎరువు, ఇంధనం వంటి ఉత్పత్తులను చేసి ధనార్జన చేయవచ్చునని మార్గ నిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వికేజె ప్రసూన మాట్లాడుతూ చెత్తను మన పరిసరాలలో పార వేయటం ద్వారా వైరస్ కారక వ్యాధులు ప్రబలుతాయని విద్యార్థులు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించా లని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, డాక్టర్ పి రాజశేఖర్, సిహెచ్ సత్యనారాయణ, జి ఉమామహేశ్వరి, ఎల్ నరసింహారావు, పి అమూల్యారావు, జి. ప్రసాద్ బాబు తదితరులు పాల్గొని విద్యార్థులను చైతన్యపరిచారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భానునాయక్ సిబ్బందికి సూచించారు, శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన తన సిబ్బందితో కలిసి డి.ఎం హెచ్.ఓ కార్యాలయ ప్రాంగణం శుభ్రపరి చారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణమైన ఆరోగ్యం ఉంటుందని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. స్వచ్ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్ట ణంలో శనివారం నిర్వ హించారు. ఈ సంద ర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి మాట్లాడుతూ స్వచ్ ఆంధ్ర - స్వచ్ దివస్ కార్యక్రమం ద్వారా గ్రామాలను పరిశుభ్రం చేసుకోవాలని, ఇళ్ల చుట్టూ, కార్యాలయాల చుట్టూ ఉన్న చెత్తను తొలగించాలని ఆమె అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యంగా ఉండవచ్చని, ప్రజలతోపాటు సకల జీవరాసులు కూడా ఆరోగ్యంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అనం తరం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్, ఇఓపిఆర్డి సతీష్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి ఆధ్వర్యంలో శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహిం చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస రాలు శుభ్ర పరిచారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధానం గుర్చి, వ్యర్థ పదార్థాల ద్వారా ఆర్గానిక్ కంపోస్ట్ ఎలా చేయాలి అనే దానిపై వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఏ వ్యాధులు దరి చేరవ, ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తద్వారా దోమల వ్యాప్తిని అరికట్ట వచ్చని వైద్యాధికారి చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె విల్సన్ బాబు, ఎం ఎల్ హెచ్ పి లు, ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్, ఆశలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కళాకారుల పెన్షన్ రూ.10 వేలకు పెంచాలి

విశాలాంధ్ర-కామవరపుకోట: ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వృద్ధ కళాకారులకు ఇస్తున్న రూ.4వేలు పెన్షన్ రూ.10వేలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎన్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వృద్ధ కళాకారులకు అందిస్తున్న రూ. 4 వేలు పెన్షన్ 70 సంవత్సరాలు నిండి ఇంటి వద్ద అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వృద్ధ కళాకారులకు వారి వైద్య ఖర్చులు కూడా చాలక ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో వృద్ధ కళాకారుల అందుకునే పెన్షన్ వారి కనీస అవసరాలు కూడా తీర్చడం లేదన్నారు.వృద్ధ కళాకారుల పెన్షన్ అంశాన్ని కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచన చేసి వృద్ధ కళాకారులను ఆదుకోవా లని ప్రభుత్వానికి చేశారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛాంధ్ర సాధ్యం అని ఎంపిడీఓ మణి కుమారి తెలిపారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం శుభ్రం చేసి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అన్నారు. నివాసిత ప్రాంతాలతో పాటు పాఠశాలలు,ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రంగా ఉండేటట్లు చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ పి. శేఖర్ బాబు, పి. రఘు, శివ,రవి తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

### జిల్లా రెవిన్యూ అధికారి యం.వెంకటేశ్వర్లు

**విశాలాంధ్ర -భీమవరం:** జిల్లాలోని ప్రముఖ శివాలయాల్లో మహా శివరాత్రికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చెయ్యాలని, సామాన్య భక్తులకు సైతం ఇబ్బందిలేని స్వామి వారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు ఉండాలని జిల్లా రెవిన్యూ అధికారి యం.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం

జిల్లా కలెక్టరేటు వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో ఈ నెల 26న మహా శివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ శివాలయాల్లో చేయవలసిన ఏర్పాట్లపై దేవాదాయ శాఖ, వివిధ శాఖల అధికారులతో జిల్లా రెవిన్యూ అధికారి యం.వెంకటేశ్వర్లు, జిల్లా ఏయస్పి వి.భీమారావు సంయుక్తంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలో అన్ని దేవాలయాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికా రులు సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. జిల్లా ఏయస్పి వి.భీమారావు మాట్ల డుతూ సామాన్య భక్తుల సయితం చిన్న ఇబ్బందులు తలెత్తకుండా సులువుగా దర్శనం అయ్యేలా చూసి తిరిగి ఇంటికి చిరునవ్వుతో వెళ్ళేలా పనిచేద్దామ న్నారు. అక్రమ మద్యం, మత్తు పదార్థాలు, జూదం జరక్కుండా కట్టుదిట్ట మైన ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్ర మంలో జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారి ఇ.వి.సుబ్బా రావు, జిల్లా అగ్నిమాపకదళ అధికారి బి.శ్రీనివాసరావు, ఆర్. బి.యస్. కె.పి.వో డా.సి.హెచ్. భావన, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యం.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## 'మా' మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆధునిక వసతులతో వైద్యం

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం :** ఏజెన్సీ ముఖద్వారమైన కొయ్యలగూడెం పట్టణంలో మా ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అన్ని వసతులతో కూడిన వైద్యం అందించ దం జరుగుతుందని వైద్యులు కూడా నిరంత రం అందుబాటులో ఉంటున్నారని, శనివారం ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో

గుండె వైద్య నిపుణులు కె. లక్ష్మణ్ తెలిపారు. ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో బుట్టాయిగూడెం మండలం ఉప్పరిల్ల గ్రామానికి చెందిన మాండ్రు వెంకటలక్ష్మి (20 సంవత్సరాలు) అనే ఆమె 8 నెలల గర్భముతో ఉమ్మనీరు పడిపోయి కాన్పు నొప్పులతో ఈనెల రెండవ తేదీన ఆసుపత్రికి వచ్చిందని తెలిపారు. ఆమెను వెంటనే గైనకాలజిస్ట్ డాక్టర్ విజేత పరీక్షించి వెంటనే నార్మల్ డెలివరీ చేయడంతో ఇద్దరు మగ కవల పిల్లలు జన్మించారని ఆమె తెలిపారు. చిన్న పిల్లల డాక్టర్ కె. చక్రపాణి మాట్లాడుతూ జన్మించిన పిల్లల బరువు తక్కువ ఉండడంతో ఆయాసంతో, ఊపిరితిత్తులు సరిగా పూడుకోక పోవడంతో వారం రోజులపాటు చంటి పిల్లలిద్దరికీ వైద్య సేవలు అందించడంతో, తల్లి, పిల్లలు, ఆరోగ్యం ఉన్నారని ఆయన అన్నారు. జనరల్ డాక్టర్ నరహరిశెట్టి సతీష్ మాట్లాడుతూ ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని, పట్టణాలలో ఉండే కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అధునాతనమైన టెక్నాలజీతో, వైద్య సేవలు ప్రజలకు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నాటు సారా కేసులలో నలుగురిపై బైండోవర్

**విశాలాంధ్ర- ముసునూరు:** ముసునూరు మండలంలో నాటుసారా కేసులలో గతంలో పట్టుబడిన నలుగురిని ముసునూరు తహసీల్దార్ వద్ద హాజరు పరిచి బైండ్ ఓవర్ చేసినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సిహెచ్ అజయ్ కుమార్ సింగ్ తెలిపారు. ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన తాళం సంపతరావు తండ్రి సుబ్బయ్య,ముసునూరు గ్రామానికి చెందిన పేరిచర్ల సాయి కుమారి భర్త రంగ బాబు,కంచర్ల పార్వతి భర్త గంగాధర్ రావు, వీరంకి సారిక భర్త శ్రీనివాసరావులపై బైండోవర్ నమోదు చేసి మరలా తిరిగి నేరాలకు పాల్పడితే వారి వద్ద నుండి రూ.1 లక్ష జరిమానా, ప్రభుత్వ పథకాలు రద్దు చేయడం జరుగుతుందని తహసీల్దార్ కె.రాజకుమార్ ఈ సందర్భంగా వారిని హెచ్చరించారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

**విశాలాంధ్ర -భీమవరం టౌన్ :** మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా మెలుగుతామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు, స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో సిబ్బందితో కలిసి పరిశుభ్రపరిచారు, అనంతరం మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా చాలావరకు అనారోగ్యాలను మన దరి చేరకుండా చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా తమ గృహాలను ఏ విధంగా అయితే శుభ్రంగా ఉంచుకుంటామో మన కార్యాలయ పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాతావరణ పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కొరకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి, గుడ్డ సంచులు వాడాలని తెలిపారు. జిల్లాలోని

అన్ని పోలీస్ స్టేషన్లో సైతం ప్రతినెల మూడవ శనివారం స్టేషన్ అధికారులు మరియు సిబ్బంది సంబంధిత స్టేషన్లలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.వి.వి సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వి.పుల్లారావు, ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ కె.వెంకట్రావు,మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు ఒలింపియాడ్‌లో మాంటిస్సోరిస్ విద్యార్థుల సత్తా

**విశాలాంధ్ర - పాలకొల్లు :** ఉలంపర్రు మాంటిస్సోరిస్ విద్యార్థులు తమ సత్తా చాటారు. లిటిల్ ఛాంప్స్ ఎడ్యు అకాడమీ హైదరాబాద్ వారిచే అక్టోబర్ నెలలో నిర్వహించిన తెలుగు ఒలింపియాడ్ లో, ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ విద్యార్థులు, 10 లోపు 2 స్టేట్ ర్యాంకులను సాధించారు. వీరిలో వాసిరెడ్డి రోచిష్ణ స్టేట్ 3 ర్యాంక్ సాధించగా, చవ్వాకుల జాహ్నవి సత్యదేవి స్టేట్ 7వ ర్యాంక్ పొందింది. ర్యాంకులను పొంద దంతో పాటు, క్యాష్ అవార్డ్సను కూడా కైవసం చేసుకున్నారు. విద్యార్థుల విజయకేతనంపై ప్రిన్సిపల్ సామవేదం వసంతలక్ష్మి మాట్లాడుతూ ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అయినప్పటికీ, విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని తెలుగు ఒలింపియాడ్ లో,

స్టేట్ ర్యాంకులు సాధించేలా ప్రోత్సహించామని చెప్పారు. ఈ సందర్భంగా స్కూల్ అడ్మినిస్ట్రేటర్, అండ్ డైరెక్టర్ మద్దాల వాసు కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్ మాట్లాడుతూ అత్యుత్తమ ర్యాంకులను సాధించడంలో ఉల్లంపర్రు మాంటిసోరిస్ ఎప్పుడూ ముందు వరుసలో నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ విజయానికి కారణమైన తెలుగు ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలి

**విశాలాంధ్ర- ఉండి :** ప్రభుత్వం అందించే పౌష్టికాహారం గర్భిణీలకు బాలింతలకు కిషోర్ బాలికలకు సక్రమంగా అందేలా ప్రతి అంగన్వాడి కేంద్రం ఉపాధ్యాయులు చూడాలని ఆకివీడు ప్రాజెక్టు సిడిపిఓ వాణి విజయరత్నం పిలుపునిచ్చారు. మండల పరిధిలోని యండగండి గ్రామంలో అంగన్‌వాడి ఉపాధ్యాయులకు స్థానిక కేంద్రంలో డిజిటల్ స్క్రీన్ శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి విజయరత్నం మాట్లాడుతూ బాలింతలకు గర్భిణీలకు రక్తహీనత లోపం లేకుండా ప్రోటీన్‌తో కూడిన పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. బాలికను రక్షించు, చదివించు, సంరక్షించు అనే నినాదాన్ని సమాజంలో ప్రతి ఒక్కరు పైన ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో

సూపర్వైజర్లు బాల కుమారి, సూర్య కుమారి, మేరీ, అంగన్వాడీ టీచర్స్ చైతన్య, విజయ, నాగమణి, వెంకటలక్ష్మి, జ్యోతి ,ప్రియదర్శిని, మేరీ, రత్నమాణిక్యం, పద్మావతి, పెద్ద బేబీ, గోవిందకుమారి, రత్న మాణిక్యమ్మ ,అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

## తక్షణ సహాయానికి సీఎం సహాయ నిధి సంజీవని

**విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు :** అవసరార్థులకు తక్షణ సాయం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవని వంటిదని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వినతులం దించేందుకు

వచ్చిన వారితో కిక్కిరిసింది. తనను కలిసి సమస్యల్ని తెలిపేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే బడేటి చంటి వారికి భరోసా కల్పించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వరచర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు కొత్త స్కీమ్‌లు అమలు చేస్తున్నామంటూ చెప్పుకొచ్చి ప్రజల్ని తీవ్రంగా మోసం చేసి ప్రజాధనాన్ని కొల్లగొట్టిందని మండిపడ్డారు. అవసరార్థులకు తక్షణ సాయం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తోందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చల్లా సత్య వరప్రసాద్, చోడే వెంకట రత్నం, పెద్దిబోయిన శివప్రసాద్ వందనాల శ్రీనివాస్, ఆర్ఎన్ఆర్. నాగేశ్వరరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై తేనెటీగల దాడి

**విశాలాంధ్ర - జీలుగుమిల్లి :** తేనెటీగల దాడిలో ఎనిమిది మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం బర్రింకలపాడు గిరిజన ఆశ్రమ

కళాశాలలో తేనెటీగల దాడి జరిగింది. ఎప్పటినుండో కళాశాల భవనంపై తేనెటీగల తుట్టె ఉంది. దానిని తొలగించే చర్యలు తీసుకోలేదు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ శర్మ, సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే ఈ తేనెటీగల దాడి జరిగింది. మొత్తం 20 మంది విద్యార్థులను తేనెటీగలు కుట్టగా అందులో 8 మంది విద్యార్థులపై తేనెటీగలు తీవ్రంగా దాడి చేశాయని వైద్యాధికారి గాయత్రి తెలిపారు. విద్యార్థులకు చికిత్స చేశారు. ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా తాము ఏమి చేయమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం విశేషం. ఉన్నతాధికారులు స్పందించి తేనెటీగల తుట్టె తొలగించా లని విద్యార్థులు కోరుతున్నారు.

## నేటి నుంచి సామాజిక తనిఖీ ప్రారంభం

**విశాలాంధ్ర-టి నరసాపురం :** ఆదివారం నుండి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16 సామాజిక తనిఖీ ప్రారంభిస్తున్నట్లు ఎంపిడీఓ మణికుమారి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాల యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కోఆర్డినేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్పి నందని పర్యవేక్షణలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రారంభిస్తున్నట్లు ఆమె

తెలిపారు. తనిఖీకి సంబంధించి అన్ని రికార్డులను తనిఖీ సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్ గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మాజీగూడెంలో సినిమా షూటింగ్

**విశాలాంధ్ర-లింగపాలెం:** ధర్మాజీ గూడెంలో పెళ్లిరోజు నూతన సినిమా చిత్రీకరణ జరిగింది. ఈ చిత్రానికి సినీ నిర్మాత, రాజకీయ నాయకులు అంబికా కృష్ణ క్లాప్ కొట్టారు. నూతన నటీనటులతో దర్శకుడు వల్లభనేని సురేష్ ఈ చిత్రాన్ని నిర్మించడంతోపాటు, దర్శకత్వం వహిస్తున్నారు. భార్యాభర్తల మధ్య వస్తున్న విభేదాలు కారణంగా విడాకులు వరకు వెళ్తున్నాయని భార్యాభర్తల బంధం కలిసి ఉండాలని నేపథ్యంలో ఈ

సినిమాను తీయటం అభినందనీయమని అంబిక కృష్ణ తెలిపారు. సినిమా చిత్ర షూటింగ్లో లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ

**విశాలాంధ్ర - రావులపాలెం :** రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ వినతులు అన్నీ సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కాస సాగర్, వెలగల శ్రీనివాస్ రెడ్డి, సాధనల శ్రీను, పడాల బుల్లి, కొండారెడ్డి మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యా హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం

**విశాలాంధ్ర - పెద్దాపురం :** ప్రతీ విద్యార్థికి విద్యార్థి దశ నుంచే విద్యా హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి దైవకృప అన్నారు. స్థానిక నవోదయ విద్యాలయలో ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన న్యాయ విజ్ఞాన అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జడ్జి దైవకృప మాట్లాడుతూ న్యాయ సేవా అవగాహన కార్యక్రమాలపై విద్యార్థులు మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి క్రమ శిక్షణ అవసరమన్నారు. ర్యాగింగ్ జోలికి పోకెండా మంచి విద్యాబుద్ధులు నేర్చుకోవాలన్నారు. అనంతరం పలువురు న్యాయవాదులు విద్యా హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, న్యాయవాదులు అత్తిలి ప్రభూజీ, మడికి రాంబాబు, వలీబాబు, సూర్యప్రభ, అనూహ్య, దుర్గారావు, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## క్లాప్స్ సేవలు సద్వినియోగం చేసుకోండి

**విశాలాంధ్ర - పెద్దాపురం :** క్లాప్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట ప్రతిభ పాఠశాల కరస్పాండెంట్ ఎన్వీవీ ప్రకాష్ అన్నారు. స్థానిక కట్టమూరు పుంతలోని కల్వరి మిరాకిల్ చర్చిలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లాప్స్ అధ్యక్షులు లంక పురుషోత్తమస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాస్టర్స్ ఫెలోషిప్ క్లాప్స్ ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్లాప్స్ సెక్రటరీ కె నాగ శ్రీనివాస్, కోశాధికారి ఎన్ సుకుమార్లు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి వైద్య శిబిరాన్ని ప్రారంభించగా సుమారు 118 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 19 మందకి ఆపరేషన్, 26 మందికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జి సత్యానందం, ఎల్ జ్ఞానానందం, జి ఆనంద్ శామ్యూల్, మేరీ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ‘చెత్తను వేరు చేద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం’

**విశాలాంధ్ర - కాకినాడ :** పొడి, తడి చెత్త, వ్యర్థాల నిర్వహణలో మూలాల విభజన అంశంతో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై..స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కాకినాడ నగరానికి సహకరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ అన్నారు. “చెత్తను వేరు చేద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం” అంటూ నినదించారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం కాకినాడ శారదమ్మ గుడి సమీపంలో ఉన్న నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ భావన మాట్లాడుతూ..ఈ శనివారం ‘సోర్స్-రిసోర్స్’ థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. దీనిలో భాగంగా వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాలను వేర్వేరు చేసి..వాటి ద్వారా ఏమేమీ ఉత్పత్తి చేయవచ్చు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తడి చెత్తను కంపోస్టుగా తయారు చేయవచ్చని, అలాగే మిథేన్‌ను తయారు చేయవచ్చని అది సీఎన్‌జీ గ్యాస్ మాదిరి వినియోగించుకోవచ్చని కమిషనర్ భావన తెలిపారు. పొడి చెత్తను కూడా వేరు వేసి వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించవచ్చని తెలిపారు. ఇటీవల తాను మహారాష్ట్ర, పూణెకు వెళ్లి అక్కడ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించానని, అది 700 పీపీడీ ప్లాంట్, ప్రతి గంట

14 మెగావాట్ల ఎలక్ట్రిసిటీని అందజేస్తుందని కమిషనర్ వివరించారు. కాకినాడ నగరంలోని 50 డివిజన్లలో ఉదయం నుంచి చెత్త సేకరణ, వినియోగంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కొండయ్యపాలెం ఫ్లైఓవర్ వరకు జరిగిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీని కమిషనర్ భావన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, అదనపు కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఈ కామేశ్వర రావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ సత్యనారాయణ, టీపీఆర్వో శైలజ, ఆర్ఓ శిరీష్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వెంకట్రాజు, అన్ని విభాగాల సూపరింటెండెంట్లు, నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ : ఎంపీడీవో

**విశాలాంధ్ర - గండేపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమము శనివారం ఎంపీడీవో నాతి బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యముతో 12 నెలలకు గాను 12 అంశాలతో నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమము ఈ వారం వనరుల వినియోగం అనే అంశానికి సంబందించినన్నారు. ఆమె మాట్లాడుతూ గండేపల్లి మండలంలో అన్ని గ్రామముల యందు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమములో భాగముగా మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు లోపల, బయట చుట్టూ పరిసరాలు శుభ్రం చేయుట, మొక్కలు పెంచుట, సంరక్షణలో భాగంగా కార్యాలయం లోపల వివిధ రకములైన మొక్కలు, విత్తనములు నాటుట జరిగినది. ఈ కార్యక్రమములో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమములో భాగముగా ప్రతిజ్ఞ చేయుట జరిగినది. గండేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డుగల వద్ద తడి చెత్త, పొడి చెత్త వేరు

చేయు కార్యక్రమముపై సిబ్బందికి తగు సూచనలు ఇచ్చి వారికి షెడ్ నిర్వహణ పై అవగాహన కల్పించారు. మురారి గ్రామము నందు పర్యటించి వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్వహణ మరియు ఇతర పారిశుధ్య కార్యక్రమములపై సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామంలో పంచాయతీ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. హౌసింగ్ కాలనీ నందు నిర్మాణములను పరిశీలించారు. ఈ కార్యక్రమములో ఎంపీడీఓ ఎన్ బుజ్జి, ఏఓ చంద్రరావు, ఏపీఓ ఆర్ గంగాభవాని, ఈసీ రమేష్, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శరీష, ఫణి కుమార్, సచివాలయ సిబ్బంది, మరియు ఎన్ఆర్‌జియస్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పేరాబత్తుల గెలుపునకు కూటమి నేతల ప్రచారం

**విశాలాంధ్ర - అమలాపురం :** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరం విజయం కోసం కూటమి నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి, రామేశ్వరం, గుడిమూల, అంతర్వేది కర, మోరి, మలికి పురం మండలం పడమటపాలెం, కేశనపల్లి గ్రామాల్లో శనివారం కూటమి నేతలు

పట్టభద్రుల ఓటర్ల వద్దకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు పేరాబత్తుల రాజశేఖరంకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. రెండవ శనివారం ఉపాధ్యాయుల సెంటర్ క్లాసులు జరుగుతుండటంతో ఆయా కేంద్రాలలో ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలు, మాజీ మంత్రి పీతల సుజాత, రాజోలు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు, జిల్లా బిజెపి అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, ఆచంట నియోజకవర్గ టిడిపి పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, రాజోలు నియోజకవర్గ టిడిపి పరిశీలకులు చిటికెన రామ్మోహన్ రావు, రాజోలు ఎంపిపి కేతా శ్రీనివాస్, సఖినేటిపల్లి మండల టిడిపి అధ్యక్షులు ముప్పర్తి నాని, ప్రధానకార్యదర్శి తాడి సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ మంగెన భూదేవి, జనసేన నాయకులు తాడి మోహన్ పాల్గొన్నారు.

## అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ

**విశాలాంధ్ర-దేవరపల్లి:** దేవరపల్లి మండల ఎర్నాగుడెంజిల్లా పరిషత్ హై స్కూల్‌లో 79 అంగన్వాడీ సెంటర్లో అంగన్వాడీ వర్కర్స్‌కు పోషణ పడాయి శిక్షణ కార్యక్రమం మూడవరోజు ముగింపు సందర్భంగా దేవరపల్లి మండలం అంగన్వాడీ సూపర్వైజర్ ఎం విజయలక్ష్మి బి విజయశాంతి ఎం శశికళలు మాట్లాడుతూ దేవరపల్లి మండలం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఈనెల 13 నుంచి 15 వరకు 79 అంగన్వాడీ సెంటర్ల వర్కర్స్‌కు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు దివాంగ పిల్లల చేరి వ్యూహాలు అంగన్వాడీ సెంటర్లో ఉన్న పిల్లలో అభివృద్ధి ఆటంకాలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన సదస్సు

**విశాలాంధ్ర - గండేపల్లి :** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ది సీక్రెట్ అఫ్ అల్టిమేట్ లివింగ్ అనే అంశంపై బిటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అవగాహనా సదస్సు జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా డాక్టర్ సచిన్ పరబ్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడతూ ఆరోగ్యకరమైన శరీరానికి ఒత్తిడి లేని జీవన శైలి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్, అడిమినిస్ట్రేషన్ డీన్ డా వైకెఎస్ సుబ్బారావు, అకాడెమిక్స్ డీన్ డా పి రవి కుమార్, విభాగ అధిపతి డా సి రాజశేఖర్ రెడ్డి, కో ఆర్డినేటర్స్ జి కిరణ్ కుమార్, ఎ నసీముద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ‘స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్’

**విశాలాంధ్ర - గండేపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంను గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా శనివారం గండేపల్లి ఎస్సై శివ నాగబాబు, సిబ్బంది గండేపల్లి పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేసి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రతినెల మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 17న నూతన ఆలయ శిలామయ విగ్రహ ప్రతిష్ఠ

**విశాలాంధ్ర - కపిలేశ్వరపురం :** అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరులో శ్రీశ్రీశ్రీ సీతారామ, అభయాంజనేయ స్వామి నూతన ఆలయ శిలామయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించి, మన నల్లూరు గ్రామంలో 17న సోమవారం ఉదయం 8:19కి చిత్తా నక్షత్రయుక్త మీన లగ్నంలో విశిష్టమైన ఉత్సవం నిర్వహించబడుతుంది. ఈ విశాలమైన కార్యక్రమంలో, పెదపూడి లక్ష్మీ జనార్ధన మూర్తి, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పండితులు, వైఖానస మహదాచార్యులు, మాచి వాస్తవ్యులు, జ్యోతిష్య శాస్త్రజ్ఞులు ఈ పవిత్ర వ్రతాన్ని నిర్వహిస్తున్నారు.

## పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

విశాలాంధ్ర - రాజానగరం : ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం తథ్యమని మాజీ జడ్పీటీసీ సభ్యులు, క్లస్టర్ ఇన్ ఛార్జ్ కొల్లం రత్నం అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ నందు పార్టీ గ్రామ అధ్యక్షులు,మాజీ ఎంపీటీసీ రాయుడు శ్రీనివాస్‌తో కలిసి శనివారం పర్యటిం చారు. స్థానిక జడ్పీ హై స్కూల్లో ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ మొదటి ప్రాధన్యత ఓటును తెలుగు దేశం పార్టీ బలపరచిన పేరాబత్తుల రాజశేఖర్ కి వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కె.ఈశ్వ రరావు, నూలు బేబీ, బొర్రా శ్యాం పాల్గొన్నారు.

## డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో శనివారం నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా వంగలపూడి ఇసుక ర్యాంపులు, ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ తనిఖీలో ఇసుక ర్యాంపులో పలు రికార్డులను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలు అనుసరించే ఇసుక రవాణా జరగాలని ఆదేశించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీతానగరం మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, సి ఐ సత్య కిషోర్, ఎస్ ఐ రామ కుమార్, రెవెన్యూ, ఇసుక ర్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయాల్లో 'స్వచ్ఛ-ఆంధ్ర'

విశాలాంధ్ర - రాజానగరం : ప్రభుత్వ ఆదేశాలు మేరకు మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియు)నందు ఎన్ఎస్ఎస్ మరియు ఎన్.సి.సి సంయుక్త ఆధ్వర్యంలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై. శ్రీ నివాసరావు మాట్లా డుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ క్లీన్ అండ్ గ్రీన్‌ను పాటించాల న్నారు. విద్యార్థులు కేవలం ఒక రోజు మాత్రమే ప్రతి రోజు పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకొనే అలవాటును కలిగి ఉండాలని తద్వారా స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ్ భారత్ లక్ష్యాలు సాధ్యమవుతా యన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ డాక్టర్ పిఎం ఎంఎస్.శర్మ తొలుత విద్యార్థులతో ప్రతిజ్ఞ గావిం చారు. అనంతరం ఆయన మాట్లా డుతూ పరిసరాల పరిశుభ్రతను తమ ఇంటి నుండి ప్రారంభించాలని సూచించారు. జిజియు, నన్నయ వర్సిటీ విద్యార్థులు ఆయా విశ్వవిద్యాలయాల్లో శ్రమదానం చేశారు.

# అధికారులు పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా అధికారులు పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు అన్నారు. శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో డీఆర్వో జె వెంకటరావు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి కలెక్టర్ కార్యాలయంలో వివిధ విభాగాలు, పౌరసరఫరాలు, వికాస కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం కింద శుభ్రం చేశారు. కార్యాలయాల్లో పెరుగుపోయిన చెత్తను తొలగించారు. కంప్యూటర్లు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో, సిబ్బంది అందరూ చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు ప్రకృతి వనరులను భవిష్యత్ తరాలకు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా అంతటా స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రతి నెల మూడో శనివారం చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం కింద ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, రహదారులు, ప్రధాన కూడళ్ళు, మురికి కాలువలు, తాగునీరు వందల దగ్గర పెరిగిపోయిన చెత్త, ఇతర పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయడం జరుగుతుం దన్నారు. దీంతో కార్యాలయాల్లోకి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో వికాస పీడీ కె లచ్చారావు, కలెక్టరేట్ ఏవో, రామ్మోహన్ రావు, కలెక్టరేట్ వివిధ విభాగాల అధిపతులు, పౌరసరఫరాలు, వికాస సిబ్బంది పాల్గొన్నారు.

## పోషకాహార లోపాల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - రాజానగరం : కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులపై దృష్టి సారించి, పోషకాహార లోపాన్ని గుర్తించి సమగ్రంగా పరిష్కరించడానికి అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయ్యాలని ఇన్ ఛార్జ్ సీడీపీవో కె.కనకవల్లి అన్నారు. ఐసీడీఎస్ రాజానగరం ప్రాజెక్టు పరిధిలోని మండలంలో రాజానగరం, పాత తుంగపాడు ఉన్నత పాఠశాలల్లో అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలకు మూడు రోజుల పాటు అందించిన శిక్షణ తరగతులు శనివారంతో ఘనంగా ముగిశాయి.రాజానగరంలో సూపర్వైజర్ దుర్గా మణి, పాత తుంగపాడు గ్రామంలో ఎన్.భూదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణకు సుమారు 98 మంది కార్యకర్తలు శిక్షణ పొందారు. పోషణ్ భీ, పఢాయి భీ అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో సాంకేతిక పరిజ్ఞానం,కలయిక మరియు సమాజ ప్రమేయం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపం,రక్తహీనత మరియు తక్కువ బరువు తో జననష్టాయిని తగ్గించడం పై అవగాహన కల్పించారు. రాజానగరం సూపర్వైజర్ దుర్గా మణి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్ని గుర్తించడం, తల్లిదండ్రులు శుభ్రత పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన కల్పించాలని అందుకు అంగన్వాడీ లు మరింత శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, సెక్టార్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ ఉపాధి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పని కావాలన్నా ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించడం జరుగుతుందని డ్రామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అమరవల్లిలో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యత పరంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## జన్యుశాస్త్రం మరింత సులభతరం

విశాలాంధ్ర - రాజానగరం : వైద్య రంగంలో ఎంతో కీలకమైన వ్యాధినిర్ధారణలు, చికిత్సల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జన్యుశాస్త్రం(జీనోమ్)ల్లో భవిష్యత్తులో మరింత సులభతరం చేసేందుకు పెనుమార్పులు రానున్నాయని గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. మండలం లోని జీఎస్ఎల్ వైద్య కళాశాల నందు జీఎస్ఎల్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన 17వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా విజ్ఞాన్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ లావు రత్తయ్య ,నిమ్ హాన్స్ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ మల్లా భాస్కరరావు, జీఎస్ఎల్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తదితరులు కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగికి వచ్చే వ్యాధి నిర్ధారణలు గుర్తించడానికి వీలుగా ఆధార్ వంటి గుర్తింపు కార్డులపై ఆయా వ్యక్తులకు సంబంధించిన జన్యుపరమైన వివరాలు సైతం నమోదు చేసే పరిస్థితి త్వరలో రానున్నదనీ చెప్పారు. వైద్య రంగంలో మానవ మేధస్సును అనుకరించేలా యంత్రాలను తయారు చేసే సాంకేతికత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పై వైద్యవిద్యార్థులు, వైద్యులు పూర్తి పట్టు సాధించాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వైద్య రంగంలో సాంకేతికత పరిజ్ఞానం మారుతున్నప్పటికి వైద్య విద్యార్థులు అనాటమీ, ఫిజియాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో క్షుణమైన అవగాహన మెరుగుపరుచు కోవాలన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న బెంగుళూరు కి చెందిన నిమ్ హాన్స్ మాజీ ప్రొఫెసర్, సుప్రసిద్ధ న్యూరో సర్జన్ డాక్టర్ మల్లా భాస్కరరావు మాట్లాడుతూ జీవనశైలితో మార్పులతో వైద్యులు కూడా రోగాలు బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరి తో పాటుగా వైద్యులకు సైతం క్రమంతప్పకుండా కొద్దిపాటి నడక వంటి చిన్న వ్యాయామాలు, చాలినంత నిద్ర చాలా ముఖ్యమని తెలిపారు. జీఎస్ఎల్ విద్యాసంస్థలు అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు అభ్యుదయం కోసం తమ సంస్థ అవలబిస్తున్న విధివిధానా లను వివరించారు. ప్రిన్సిపాల్ మేజర్ జనరల్ డాక్టర్ వి.గురునాథ్ మాట్లాడుతూ 2019 బ్యాచ్ విద్యార్థుల డిగ్రీ పట్టాలు తీసుకోవడం జరుగుతుందన్నారు.మెడికల్ సూప రింటెండెంట్ బ్రిగేడియర్ డాక్టర్ టివిఎస్పి మూర్తి వైద్యరంగంలో పాటించవలసిన నీతి నియమాలకు కట్టుబడి ఉంటామని భావి వైద్యులతో ప్రతిజ్ఞ గావించారు. అనంతరం తల్లిదండ్రులు సమక్షంలో విద్యార్థులకు పట్టాలు అందజేశారు. దీనిలో భాగంగా అతిథులను ఘనంగా సత్కరించారు. జీఎస్ఎల్ వైద్య కళాశాల వివిధ శాఖాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోనీ రాజవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్ని, ఆత్రేయపురం పోలీసు స్టేషన్‌కి సమాచారం రావడంతో ఎస్సై ఎస్ రాము తన స్టేషన్ సిబ్బందితో పేకాట ఆడుతున్న శిబిరంపై మెరుపుదాడి చేయగా పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్దనుండి రూ.3800లు స్వాధీన చేసుకున్నారు. అనం తరం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ రాము తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రత

విశాలాంధ్ర - పెదపూడి : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. శనివారం ఎంపీడీవో నరేంద్ర రెడ్డి, ఈవోఆర్డీ ఎంఎస్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయం, పరిసర ప్రాంతాలు శుభ్రం చేశారు. స్వయంగా ఎంపీడీవో నరేంద్ర రెడ్డి, ఈవోఆర్డి ఎంఎస్ఎన్ రెడ్డి కార్యాలయ ఆవరణ, వస్తువులు శుభ్రం చేశారు. అనంతరం తడి చెత్త, పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## భక్త జనసంద్రంగా వాడపల్లి దివ్య క్షేత్రం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కలియుగ వైకుంఠం కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు నీరాజనాలు సమర్పించారు. ఉదయం వేకువజామునే సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించి తనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాష్ట్ర నలుమూల నుండి కాలినడకన వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు ఏర్పాటును పూర్తి చేసి పర్యవేక్షించారు. ప్రసాద వితరణ, అన్నదానం నిశనివారం స్వామివారి ఆదాయం రూ.38,21,881లు సాయంత్రం ఐదు గంటల వరకు వచ్చిన ఆదాయం. ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింట్ పి రాంబాబు, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు(గబ్బర్ సింగ్), లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐఐ ఎస్ రాము పాల్గొన్నారు.

## 'స్వచ్ఛ -ఆంధ్ర'

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కేవికే దుర్గారావు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ -ఆంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ కెవికె దుర్గారావు ఈవోపిఆర్ఆర్‌డి రాజారావు మండల పరిషత్ పర్యవేక్షణ అధికారి జి శాంతి మండల పరిషత్ ఆవరణ సుబ్రపరిచారు. ఈ సందర్భంగా ఎంపీపీ కెవికె దుర్గారావు మాట్లాడుతూ మూడవ శనివారం ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర చేపట్టాలని ఆదేశించిందని తెలిపారు. మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు ఎంపీపీ కెవికె దుర్గారావు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

## ఆసుపత్రిలో స్వచ్ఛ దివాస్

విశాలాంధ్ర -కొవ్వూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కొవ్వూరు సామాజిక వైద్య కేంద్రంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ల కాకర్ల సాయికిరణ్ వైద్యులు సిబ్బంది స్వచ్ఛత సేవపై అవగాహన కల్పించారు

## బీమా పథకాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - మామిడికుదురు : జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష యోజన బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఫైనాన్షియల్ లిట సీఎస్ విజయ్ కుమార్, కౌన్సిలర్ ప్రసాద్ సూచించారు మాకనపాలెంలో ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమంలో భాగంగా శనివారం ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి విధిగా లావాదేవీలు నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష యోజనలో ప్రతి ఏడాది రూ.20లు చెల్లించి 18 నుంచి 70 ఏళ్ల వారికి ప్రమాద బీమా రెండు లక్షలు వర్తిస్తుందన్నారు. జీవనజ్యోతిలో ఏడాదికి రూ.436లు చెల్లించిన 18 నుంచి 50 ఏళ్లవారికి సహజ మరణానికి రెండు లక్షలు సహాయం అందుతుందన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి హామీ, డ్వాక్రా, ఇతర రంగాల కార్మికులకు బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

## పేదలకు చీరల పంపిణీ

విశాలాంధ్ర - మామిడికుదురు : మగటపల్లిలో నామన కృష్ణవేణి జ్ఞాపకార్థం 100 మంది పేద మహిళలకు శనివారం జడ్పి మాజీ చైర్మన్ నామన రాంబాబు చీరలు అందజేశారు. డాక్టర్లు నామన వినోద్ నామన శృతిల ఆధ్వర్యంలో పేదలకు అండగా నిలవాలని సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. మాజీ సర్పంచ్ బొలిశెట్టి జయరామ్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు బొలిశెట్టి ప్రభుదాస్, సరెళ్ల సత్యనారాయణ, కుంపట్ల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగ్యస్వామ్యంతో పరిశుభ్రత

విశాలాంధ్ర - అనపర్తి : ప్రజల భాగ్యస్వామ్యంతో పరిశుభ్రత పరిసరాలను మెరుగుపరచవచ్చని అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రామ గుర్రెడ్డి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.వైద్యశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి,చెత్త తొలగించి శుభ్రం చేశారు. ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి,సిఎస్ ఆర్ఎంఓ డాక్టర్ పద్మశ్రీ, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్ పాల్గొన్నారు.

# పన్ను బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ : కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : మొండి బకాయిదారులకు నోటీసులు ఇచ్చి, పన్ను వసూళ్లు రాబట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన రెవెన్యూ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శనివారం కమిషనర్ డిప్యూటీ కమిషనర్ కె మనోహర్, ఇతర రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అడ్మిన్‌లతో రెవెన్యూ వసూళ్లపై సమీక్షించారు. రూ.కోట్ల మేర పేరుకుపోయిన మొండిబకాయిలపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే మార్చి నెలాఖరు నాటికి బకాయిలను పూర్తిగా వసూలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లదేనన్నారు. వెంటనే బకాయిదారులకు నోటీసులు ఇవ్వాలని, నోటీసులు ఇచ్చినా స్పందించని వారి మంచినీటి కుళాయిలు కట్ చేయాలని తెలిపారు. పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అడ్మిన్‌లు బాధ్యతగా వ్యవహరించాలని, లేకుంటే షోకాజ్‌నోటీసులు అందించడంతో పాటు, అవసరమైతే సస్పెన్షన్ వేటు వేస్తామని హెచ్చరించారు.

## ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

విశాలాంధ్ర - కరప : ప్రజలు ప్లాస్టిక్ వాడకం తగ్గించి, జనపనార వస్తువులను, సంచులను, బుట్టలను ఉపయోగించుకోవాలని పంచాయతీ విస్తరణ అధికారి సలాది వెంకట శ్రీనివాసరావు తెలిపారు. కరప మండలం నడకుదురు గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి డిఎల్‌పిఓ అన్నామని ముఖ్య అతిథిగా విచ్చేసి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వచ్చినప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలను ఒక బుట్టలో తడి వ్యర్థాలను మరొక బుట్టలో వేసి వాళ్లకు అందియాలని ఆమె తెలిపారు. కరప మండలంలో ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్యంపై అవగాహనతో పాటు శుభ్రం చేయించడం జరిగిందని ఈవోపీఆర్డి శ్రీనివాసరావు తెలిపారు.

## పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి : గత ఏడు నెలలుగా కూటమి ప్రభుత్వం చేసిన, రాబోయే రోజుల్లో చేయబోయే అభివృద్ధిని వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఓటర్లను కలిసి కోరారు. శనివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కూటమి ఎన్నికల పరిశీలకులు చింతల రామకృష్ణ స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అనపర్తి యూనిట్ కార్యాలయంలో పట్టభద్రుల ఓటర్లను, అంగన్వాడీ టీచర్స్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

## కూటమి అభ్యర్థిని గెలిపించండి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ ఏలేశ్వరం మండల అధ్యక్షుడు గొల్లపల్లి బుజ్జి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు శనివారం ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలో స్థానిక ఎన్డీఏ శ్రేణులతో కలిసి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించామన్నారు. ఈ ప్రచారంలో భాగంగా స్థానిక సచివాలయాలు, స్థానిక పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలలో కరపత్రాలు పంచుతూ, గ్రాడ్యుయేట్ ఓటర్లను ఓట్లను అభ్యర్థించడం జరిగిందని అన్నారు. ఎన్డీఏ కూటమి నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న పేరాబత్తుల రాజశేఖరంకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించవలసిందిగా కోరామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు బుద్దా ఈశ్వరరావు, ఎన్డీఏ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే కుటుంబానికి ఆసరాగా ఉంటారని, వారి జీవితాలకు భరోసా ఉంటుందని జిల్లా అడిషనల్ ఎస్పి(అడ్మిన్)ఎన్.బి.ఎం మురళీకృష్ణ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం డిపో ప్రాంగణంలో మేనేజర్ షేక్ షబానా ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో నందు గత నెల రోజులుగా నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు తూర్పుగోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి కుమారి షర్మిల అశోక అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఎస్పీ(అడ్మిన్) ఎన్.బి.ఎం. మురళీకృష్ణ మాట్లాడుతూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వాహనదారులు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు విధిగా సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. 23 మంది ప్రమాదరహిత డ్రైవర్లను ఘనంగా సత్కరించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన ఏర్పాటు చేసిన చిత్రలేఖనం పోటీలో గెలుపొందిన 22 మంది విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబానా తో పాటుగా గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల మేనేజర్లు,వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవలు

విశాలాంధ్ర - రాజానగరం : మండలంలోని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి ఉచిత వైద్య సేవలు శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ యూనిట్ మరియు డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ మరియు శ్రీ వాణి దంత వైద్యశాల, డాక్టర్ నీరజ డయాబెటీస్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరంలో మధుమేహ, రక్తపోటు పరీక్షలు డాక్టర్ నీరజ డయాబెటీస్ సెంటర్, కంటి పరీక్షలు డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్, దంత పరీక్షలు డాక్టర్ శ్రీ వాణి పరీక్షించారు. గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామ చంద్రన్ కంటి పరీక్షలు 80 మంది,దంత పరీక్షలు 60 మంది, రక్త పోటు, మధుమేహ పరీక్షలు 72 మంది పరీక్షించుకున్నారని తెలిపారు. ఎన్ ఎస్ ఎస్ పీవో షేక్ మీరా, వైద్యుల డాక్టర్ కె.మనోహర్, డాక్టర్ డి.కవిత, ప్రసూష పాల్గొన్నారు.

## పాఠశాలకు స్కౌట్ యూనిఫామ్‌లు అందజేత

విశాలాంధ్ర - కడియం : విద్యార్థులు సేవా గుణం కలిగి ఉండాలని పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పల్ల వీర వెంకట సత్యనారాయణ, పల్ల సుబ్రహ్మణ్యం, పల్ల గణపతి అన్నారు. కడియం ఎవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కొరకు పదివేల రూపాయలు విలువ చేసే స్కౌట్ యూనిఫాంలను ట్రస్ట్ తరఫున అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి సత్యనారాయణ మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పిఎంశ్రీకి ఎన్నికైన పాఠశాలల్లో స్కౌట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు, తమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, బి గిరిజ లు స్కౌట్ శిక్షణ తీసుకున్నారని, తమ పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు పల్ల వినయ్, గైడ్ టీచర్ బి గిరిజ, గైడ్ సహాయకురాలు వై వీర రాఘవ కుమారి, డేవిడ్ పాల్గొన్నారు.

## ప్రైమరీ పాఠశాలగా మార్చాలని డీఈవోకి వినతి

విశాలాంధ్ర - మామిడికుదురు : అప్పనపల్లిలో గేద్దం వారి ఆవాస ప్రాంతంలో గల ప్రాథమిక పాఠశాలలను గతంలో మాదిరిగా ఐదు తరగతులు నిర్వహించి బేసిక్ ప్రైమరీ పాఠశాలగా మార్చాలంటూ స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు స్థానికులు శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణలకు వినతి పత్రం సమర్పించారు. గతం ఏడాది 3,4,5, తరగతులను స్థానిక హైస్కూల్లో విలీనం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న విలీన ప్రక్రియలో భాగంగా మెయిన్ ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తించి హైస్కూల్లో 3,4,5 తరగతుల వారిని మళ్లీ రెండవ సారి విలీనం చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. ఈ ప్రాంతం నుండి విలీనమైన 20 మంది విద్యార్థులను తిరిగి పూర్వము మాదిరిగా విలీనం చేయాలని వినతితో కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సర్పంచ్ గేద్దం మంగా లక్ష్మి, ఎంపిటిసి బొంతు నీలిమ, పిఏసిఎస్ మాజీ చైర్ పర్సన్ గేద్దం కృష్ణమూర్తి, విద్యా కమిటీ చైర్మన్ కె విజయ, సానికులు పాల్గొన్నారు.


**PUBLIC NOTICE**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ
మండల ప్రజా పరిషత్, కడియం
టెండరు నోటీసు
టెండరు నోటీసు నెం. 1/2025 తేది. 15.02.2025

తూర్పు గోదావరి జిల్లా కడియం మండల ప్రజా పరిషత్ కార్యాలయమునకు "40 నీల్ కమల్" బ్రాండ్ కుర్చీలు సరఫరా చేయుటకు టెండర్లు కోరడమైనది. టెండర్ దాఖలు చేయుటకు ఆఖరు తేదీ. 29-02-2025 మధ్యాహ్నం గం 3.00 లు. ఇతర వివరములు కొరకు కడియం మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.

సం/- కె. రమేష్
మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మండల ప్రజా పరిషత్, కడియం.

## పేరాబత్తుల గెలుపునకు కూటమి నేతల ప్రచారం

**విశాలాంధ్ర - రాజోలు :** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరం విజయం కోసం కూటమి నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఇందులో భాగంగా రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల వద్దకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ మంత్రి పీతల సుజాత కూటమి నేతలు వెళ్లి ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థించారు. పేరాబత్తుల రాజశేఖర్‌కు 1వ నెంబర్‌పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో రాజశేఖర్‌ను గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ కమిటీ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, రాజోలు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, కూటమి నేతలు చాగంటి స్వామి, సత్తిరాజు స్వామి, సూరిశెట్టి శ్రీను, బందెల పద్మ, అదబాల విజయ్, నామన షన్ముఖ్, కోళ్ల బాబి, రాజు, బారం రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

**విశాలాంధ్ర ఏలూరు:** ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి తపాలా బ్యాలెట్‌కు అవకాశం కల్పించినట్లు తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. 27న జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం, ఎన్నికల విధులలో పాల్గొను సిబ్బంది వారి ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించు కోవచ్చునన్నారు. ఎన్నికల విధులలో పాల్గొను సిబ్బంది వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫారం-12 ను జిల్లా రిటర్నింగ్ అధికారి, తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల పట్టబద్రుల నియోజక వర్గం/జిల్లా కలెక్టర్, ఏలూరు వారికి ఈనెల 20 సా.గం.5 లోపు సమర్పించాలన్నారు. సిబ్బంది ఫారం-12ను eluru.ap.gov.in నుండి డౌన్లోడ్ చేసుకొన వలసింది గా కోరారు. పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తు చేయు సిబ్బంది ఫారం-12 తో పాటు వారికి డ్యూటీ కేటాయింపు చేసిన ఉత్తర్వులు ప్రతి జతపరచ వలసిందిగా కోరారు.

# పటిష్టంగా జట్లు లేబర్ యూనియన్ : తాటిపాక

**విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ :** క్రమ శిక్షణకు మారుపేరైన జట్లు లేబర్ యూనియన్ మరింత పటిష్టంగా ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మదు పిలుపు నిచ్చారు. రాజమండ్రి జట్లు లేబర్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం జరిగింది. అయితే గతంలో పని చేసిన కార్యవర్గమే తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన కమిటీకి మధు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణకు మారుపేరైన జట్లు లేబర్ యూనియన్ బలమైన యూనియన్‌గా ఏర్పడుతుందన్నారు. కార్మిల సమస్యలు పరిష్కరించడంలో విజయవంతమవుతుందన్నారు. చిట్టూరి ప్రభాకర్ చౌదరి ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళడంలో ఈయూనియన్ విశేష కృషి చేస్తుందన్నారు. ఈ కార్యవర్గం మరో రెండేళ్ళ పాటు కొనసాగుతుందన్నారు. కార్యవర్గ అధ్యక్షుడిగా కె.రాం బాబు, కార్యదర్శిగా సప్పా రమణలు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వీరి నాయకత్వంలోని అధికార బాడీ, కమిటీ కొనసాగాలని జట్టు మేస్త్రీలు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈకమిటీ మరో రెండేళ్ళ పాటు జమాఖర్చులు నిర్వహించనున్నారు.

# ప్లాస్టిక్ నిర్మూలనతో క్యాన్సర్ జయిద్దాం : కలెక్టర్

**విశాలాంధ్ర -భీమవరం :** ప్రతి రెండు మూడు కుటుంబాల్లో క్యాన్సర్‌కు ప్లాస్టిక్ ఒక కారణంగా ఉందని, ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిర్మూలనకు ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కేశవరావు హైస్కూల్ ఆవరణలో 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో శనివారం 'సోర్స్ - రిసోర్స్ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ మన ఆరోగ్యాన్ని ఎలా కబళిస్తుందో తెలిసికూడా దాని వైపే ముగ్గు చూపటం అవసరమా అని ప్రశ్నించారు. మన జిల్లాలో ముఖ్యంగా భీమవరం పరిసర ప్రాంత గ్రామాలలో ప్రతి రెండు, మూడు కుటుంబాల్లో ఒకరు క్యాన్సర్ పేషెంట్ కావడానికి ప్లాస్టిక్ కారణంగా ఉంది అనడంలో ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. కలెక్టరేట్లో ప్లాస్టిక్ వస్తువులు స్థానంలో స్టీల్ వాటర్ బాటిల్స్, స్టీల్ ప్లేట్స్, స్టీల్ టీకప్స్ వినియోగిస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2014లో రెడ్‌పోర్ట్ నుంచి భారత ప్రధానమంత్రి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రకటించడం జరిగిందన్నారు. నాటి నుండి నేటి వరకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను చేపట్టి అమలు చేయడం జరుగుచున్నదన్నారు. ప్లాస్టిక్ కవర్లలో ఎవరైనా ఇచ్చిన తిరస్కరించాలని, అలాగే వినియోగదారులు సంచులు తీసుకురాకపోతే వస్తువులు అమ్మ వద్దని సూచించారు. కార్యక్రమానికి హాజరైన వారితో జిల్లా కలెక్టర్ స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. చివరగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మహిళలకు గుడ్డ సంచులను, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులను వ్యాపారస్తులకు అందజేశారు. భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డీఆర్డిఏ పిడి ఎమ్ఎస్ఎస్ వేణుగోపాల్, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, సంఘ సేవకులు కంతేటి రామరాజు, మున్సిపల్ సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఏసీపీ ఎం శ్రీలక్ష్మి,, మున్సిపల్, మెప్మా, డీఆర్డిఏ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా సర్వే పూర్తిచేయాలి : కలెక్టర్

**విశాలాంధ్ర భీమడోలు:** సచివాలయాల సిబ్బందికి కేటాయించిన విధుల టార్గెట్‌ను త్వరితగతిన పూర్తిచేసి నివేదికను అందజేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛదివాస్‌లో భాగంగా గుండుగొలను గ్రామంలో పాల్గొన్న అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి భీమడోలు తహసీల్దారు కార్యాలయంలో జెడ్పి సిఇఓ కె. సుబ్బారావు, డిపివో కె. అనురాధ, బీసీ సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి, తహసీల్దారు రమాదేవి, యంపీడీవో పద్మావతి, సచివాలయాల కార్యదర్శులు, వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సదస్సుల అర్జీలు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, హౌసింగ్, భూసర్వే, ఆధార్ నమోదు, ఆధార్ డిట్స్, వాటర్ ట్యాంకు క్లీనింగ్, క్లోరినేషన్, ప్రభుత్వ ఆస్థుల స్వాధీనం, తదితర అంశాలపై మండలంలోని పంచాయతీల వారిగా సమీక్ష చేశారు. ఎట్టి పరిస్థితుల్లోను గడువులోపు ఏరోజుకారోజు ఫొటోలతో సహా నివేదకలను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్‌పై అవగాహన

**విశాలాంధ్ర - ప్రత్తిపాడు :** మండలం మహిళా సమాఖ్య వెలుగు కార్యాలయంలో స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం వై వెంకట్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. అలాగే కార్యాలయ ఆవరణలో తుప్పలు తొలగించారు. ఆఫీసులోని రికార్డులును శుభ్రపరిచారు. అనంతరం కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసిలు వై శ్రీను, ఎన్ నూక రత్నం, అకౌంటెంట్ నాగేశ్వరరావు, మండల మహిళ సమాఖ్య సభ్యులు, డ్వాక్రా యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ దివాస్

**విశాలాంధ్ర - జగ్గంపేట :** స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని పరిసరాలను వైద్యులు, సిబ్బంది శనివారం శుభ్రపరిచారు. ఆసుపత్రి ప్రధాన వైద్యులు ప్రణీత్ ఆద్వర్యంలో ఆసుపత్రి ఆవరణంలోని చెత్తను ఊడ్చారు. నెలలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని గత జనవరిలో ప్రభుత్వం నిర్దేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో కార్యాలయాల పరిసరా లను క్లీన్ చేశారు. దానిలో భాగంగా ఈ మూడో శనివారం ఆసుపత్రి వద్ద చెత్తను శుభ్రపరిచారు. పోలీసు స్టేషన్ అవరణంలోని చెత్తను సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ రఘునాథ్‌రావులు సిబ్బందితో కలిసి శుభ్రపరిచారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో మొక్కలు నాటారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**విశాలాంధ్ర - ప్రత్తిపాడు :** మండలంలోని ఒమ్మంగి జడ్పీ హైస్కూల్‌లో శనివారం మహిళా చట్టాలు, హక్కులు, బాల బాలికల రక్షణ, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎస్ లక్ష్మికాంతం తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మీకాంతం మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయిలు మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ విధంగా ఎవరైనా మీతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లయితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని తెలియజేశారు. విద్యార్థులు స్కూలుకి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు రోడ్డుకి ప్రక్కగుండా నడుస్తూ తగు జాగ్రత్తలు కోరారు. అదే విధంగా ప్రేమ పేరుతో నయవంచకుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. లవ్ ట్రాప్ జోలికి పోకుండా శ్రద్ధగా చదువుకోవాలన్నారు. తోటి విద్యార్థులను పట్ల ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జనన, మరణ నమోదు తప్పనిసరి : బుల్లి కృష్ణ

**విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు :** ప్రజలు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు వివాహ, కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ కార్యక్రమాలకు దోహదపడుతుందని అదనపు సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బుల్లి కృష్ణ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (యఫ్ఎసి) ఏం.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె. కె.వి.బుల్లి కృష్ణ శనివారం ఏలూరులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జనన, మరణాల నమోదు, కుల ధ్రువపత్రాలు, వివాహ ద్రవపత్రాలు జారీ అంశాలపై సంబంధిత అధికారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బుల్లి కృష్ణ మాట్లాడుతూ జనన మరణాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అలాగే వివాహ పత్రాలను నిర్దిష్ట సమయంలో సంబంధిత ఆఫీసులలో నమోదు చేసుకొని ధ్రువపత్రాలను పొందాలని సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలకు ఈ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అని వివరించారు. అంతేకాకుండా ఇతరత్రా కార్యక్రమాలకు సైతం పైన తెలిపిన ధ్రువీకరణ పత్రాలు లేని పక్షంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. అందువల్ల ధ్రువపత్రాలను జారీచేసే అధికారులు అవసరమైన సూచనలు, నిబంధనలను ప్రతి ఆఫీసులో బహిర్గతం చేయాలని తద్వారా ప్రజలకు ధృపత్రాలను పొందటం సులభతరం అవుతుందని స్పష్టం చేశారు. ప్రతి పంచాయతీ కార్యాలయంలో, సచివాలయాలలో ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. అలాగే ఈ ధ్రువపత్రాల జారికి సంబంధించిన చట్టాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్టర్ కే. శ్రీనివాసరావు, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ అంబరీష్, ఏలూరు మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఏలూరు తాసిల్దారు శేషగిరి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పియన్వి. మునేశ్వర రావు, పానల్ లాయర్ కూనా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.